క్లుప్తంగా

తప్పుల తడకగా ఎస్సీ జాబితా


అరుగుల మోషే

కోటనందూరు: గ్రామ సచివాలయాల్లో ఉంచిన ఎస్సీ జాబితాలు తప్పుల తడకగా ఉన్నాయని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అరుగుల మోషే ఆరోపించారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఉంచిన ఎస్సీ జాబితాను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011లో తయారు చేసిన ఈ జాబితాల్లో మాదిగ సామాజిక వర్గానికి చెందినవారి పేర్లు క్రైస్తవులుగా, మాలలుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఇంటింటా సర్వే నిర్వహించి కులగణనపై సమగ్ర జాబితాను తయారు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను కాలయాపన చేసేందుకే కులగణన అంశాన్ని ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చిందని విమర్శించారు.

అనంతపురం సీఐపై హత్య కేసు నమోదు చేయాలి

ప్రత్తిపాడు: సివిల్ వివాదంలో స్టేషన్‌కి పిలిపించి తన చాంబర్లో అనంతపురం సీనియర్ న్యాయవాది బీవీ శేషాద్రిపై అనుచితంగా ప్రవర్తించి, ఆయన మరణానికి కారణమైన 3వ పట్టణ సీఐ, సిబ్బందిపై హత్యకేసు నమోదు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగత శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకోకూడదని పలు పర్యాయాలు హైకోర్టు పోలీసులకు ఆదేశాలు జారీ చేసినా తరచూ ఇటువంటి సివిల్ వివాదాల్లో పోలీసుల జోక్యం మితిమీరుతోందని అన్నారు. ఒక తప్పుడు ఫిర్యాదుపై న్యాయవాది శేషాద్రిని, అతని జూనియర్లను స్టేషన్‌కు పిలిపించారన్నారు. జూనియర్ న్యాయవాదులను బయటే నిలువరించి, శేషాద్రిపై సీఐ శాంతిలాల్, అతని సిబ్బంది అనుచితంగా, దురుసుగా ప్రవర్తించి ఆయన మరణానికి కారణమయ్యారని ఆరోపించారు. దీనిపై జ్యుడీషియల్ విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


కోటనందూరులో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

కోటనందూరు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై రామకృష్ణ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఆదివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ భారీ పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు అనేక యాప్‌ల ద్వారా మనకు తెలియకుండానే మోసం చేస్తున్నారన్నారు. మోసం చేసే విధానాలపై ప్రయోగాత్మకంగా ప్రజలకు అవగాహన కల్పించారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సురేష్


మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సురేష్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. పట్టణంలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడుగా నీలి సురేష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి బీజేపీని పటిష్ఠ పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పార్టీ నూతన కమిటీల ద్వారా దిగువ శ్రేణి కార్యకర్తల్లో నూతన ఉత్తేజం తీసుకువస్తామన్నారు. అనంతరం నీలి సురేష్‌ను ఘనంగా సన్మానించారు. ఎన్నికల అధికారిగా ఊటా వీరబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కామినేని జయశ్రీ, మట్ట మంగరాజు, పైల సుభాష్‌చంద్రబోస్, సింగిలిదేవి సత్తిరాజు, పైల అయ్యప్ప, పలివాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గొరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గొరంపేటలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

అపూర్వ కలయిక.. ఆనంద డోలిక

- వైభవంగా భూపతిపాలెం గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం
- రెండు రోజుల పాటు ఆటపాటలతో సందడి
- ముఖ్యఅతిథులుగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఎస్పీ నరసింహ కిశోర్

గోకవరం: వారంతా అదే పాఠశాలలో చదువుకున్నారు. ఉన్నత విద్యను అభ్యసించి దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. మహాసమ్మేళనం పేరుతో ఒక చోట చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రెండు రోజుల పాటు ఆటపాటలతో సందడి చేశారు. తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. మండలంలోని భూపతిపాలెం డాక్టర్ డీఎస్ రాజు గురకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం వైభవంగా జరిగింది. పాఠశాల స్థాపించినప్పటి నుంచి ఇప్పటి వరకు పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా మహాసమ్మేళనం-2024 పేరిట ఈ వేడుక నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ మంచి ఆశయంతో కల్నల్ డీఎస్ రాజు సుమారు 171 ఎకరాల్లో 1984లో ఈ పాఠశాలను స్థాపించారన్నారు. ఇక్కడ చదువుకున్న వారు ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు నివేదించామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో త్వరలో ఈ ప్రాంతాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుస్తామన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచే పాఠశాలలో ఇంటర్మీడియెట్ ప్రారంభించడానికి కృషి చేస్తానని తెలిపారు.


మహా సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ


మహా సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

రెండు వేల మంది హాజరు

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తారన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులు పోటీలో దిగితే పతకం తీసుకెళ్లడం ఖాయమనే భావన ప్రత్యర్థుల్లో ఉంటుందన్నారు. తాను కూడా గురుకుల పాఠశాల విద్యార్థినే అని తెలిపారు. శ్రీకాకుళం జిల్లా ఎస్ఎన్‌పురం గురుకుల పాఠశాలలో తాను విద్యాభ్యాసం చేశానని, ఆ సమయంలో భూపతిపాలెం పాఠశాలతో చదువు, క్రీడల్లో తాము పోటీ పడేవారమని ఆనాటి విషయాలను ఎస్పీ గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నెహ్రూ, ఎస్పీ నరసింహకిశోర్‌తో పాటు పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి సుమారు రెండు వేల మంది పూర్వ విద్యార్థులు హాజరై సందడి చేశారు. వీరిలో పలువురు విదేశాల నుంచి వచ్చిన వారు ఉన్నారు. వీరంతా శనివారం, ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేసి ఆనాటి తీపి గుర్తులను నెమరు వేసుకుని ఉత్సాహంగా గడిపారు. దీనిలో భాగంగా అలుమ్నీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రవి, పాఠశాల కమిటీ చైర్మన్ గళ్లా రాము, అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


మహాసమ్మేళనంలో మాట్లాడుతున్న తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిశోర్

చాలా ఆనందంగా ఉంది



నేను ఈ పాఠశాలలో 1991 నుంచి 1995 వరకు చదువుకున్నాను. యూఎస్, యూకేతో పాటు బెంగళూరు, కాకినాడలో క్రిఫి ఇన్నోవేషన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించాను. ఈ పాఠశాలలో చదువుకోవడం ద్వారా ఇంత స్థాయికి ఎదిగాను. మహాసమ్మేళనం ద్వారా మళ్లీ పాఠశాలకు రావడం చాలా ఆనందంగా ఉంది.

– కె.కృష్ణారెడ్డి, క్రిఫి ఇన్నోవేషన్ సాఫ్ట్‌వేర్ సీఈఓ

డాక్టరేట్ అందుకుని నేరుగా ఇక్కడకే వచ్చాను



నేను 2002 పదో తరగతి వరకు ఈ పాఠశాలలో చదువుకున్నాను. ప్రస్తుతం బెంగళూరులో హాస్పటల్ ఎండీగా ఉన్నాను. సోషల్ సర్వీసెస్‌లో చేసిన రీసెర్చ్‌కి గాను శనివారం హోసూర్‌లో డాక్టరేట్ అందుకున్నాను. మా స్నేహితులతో ఆ ఆనందం పంచుకోవడానికి అక్కడి నుంచి నేరుగా ఇక్కడకు వచ్చాను.

– డాక్టర్ వి.ఉదయ చక్రవర్తి, పూర్వ విద్యార్థి, బెంగళూరు

32 ఏళ్ల తరువాత మళ్లీ పాఠశాలకు...



నేను 1992-93లో పదో తరగతి చదువుకున్నాను. ప్రస్తుతం కొవ్వూరులో ఆర్టీసీ డిపో మేనేజర్‌గా పని చేస్తున్నాను. 32 సంవత్సరాల తరువాత పాఠశాలకు రావడం ఆనందంగా ఉంది. నాటి నుంచి నేటి వరకు పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందుతోంది. రానున్న కాలంలో ఈ పాఠశాల మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నాను.

– వైవీవీఎస్ కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్, కొవ్వూరు

విద్యార్థులకు నాణ్యమైన విద్య



నేను ఈ పాఠశాలలో 2006 నుంచి 2020 వరకు 14 సంవత్సరాల పాటు సంస్కృతం ఉపాధ్యాయుడిగా పని చేసి ఇక్కడే ఉద్యోగ విరమణ పొందాను. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాప్రమాణాలు, క్రమశిక్షణతో కూడిన విద్య అందుతోంది. అలుమ్ని సభ్యుల సహకారంతో మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. పాఠశాలలో నూతన డార్మెట్రీ నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు మరింత మేలు జరుగుతుంది.

– చెరుకూరి రామ్మూర్తి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, భూపతిపాలెం గురుకుల పాఠశాల

పగటి వేషగాళ్లకు సన్మానం


లింగంపర్తిలో పగటి వేషగాళ్లను సన్మానిస్తున్న సుబ్బారావు, గ్రామస్తులు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామంలో ఆదివారం పగటి వేషగాళ్లను ఘనంగా సన్మానించారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా సభ్యుడు ఆలమూరి సుబ్బారావు ఆధ్వర్యంలో తాడేపల్లిగూడేనికి చెందిన ఎడవల్లి నాగరాజు, ఎడవల్లి లోవరాజులను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మండల పరిధిలోని గ్రామాల్లో నాగరాజు తన సహాయకుడు లోవరాజుతో కలిసి రామాంజనేయులు, కాళికాదేవి, జాంబవంతుడు, శివుడు తదితర పగటి వేషాలు వేసి ఇక్కడ ప్రజలకు సుపరిచితులయ్యారని తెలిపారు. హిందూ సంప్రదాయాలను కొనసాగిస్తున్న నాగరాజు సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఉడతల రమణారావు, గవరసాని పెద్దకాపు, అడపా వీరభద్రరావు, హనుమంతు అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

గోకవరం: మండలంలోని కామరాజుపేటలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఆదివారం గోకవరం ఎస్సై పవన్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడిపుంజులు, 13 కోడి కత్తులు, రూ.1100 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం కోర్టుకు తరలిస్తామని ఎస్సై తెలిపారు. సంక్రాంతి పండుగ ముసుగులో గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి క్రియ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కిర్లంపూడి: కాకినాడ జేఎన్‌టీయూలో శనివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రియా పోటీల్లో తామరాడ ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ, తృతీయ స్థానం సాధించారు. తామరాడ పాఠశాలకు చెందిన విద్యార్థులు జూనియర్ విభాగంలో అయ్యో.. నే బడికిపోతా లఘు నాటికకు ద్వితీయ స్థానం, సీనియర్ విభాగం నుంచి మాతృదేవోభవ లఘు నాటకానికి తృతీయ స్థానం సాధించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన కె.బుజ్జియ్య, సీహెచ్ పవన్‌కుమార్, ఐ.వినయ్‌కుమార్, పి.జీవన్ కుమార్, జి.శ్రీరామ్, బి.చంద్రలేఖ, ఎ.కృష్ణ, ఎస్.వాస్తవి దుర్గ, జి.వీర చక్ర, వారికి తర్ఫీదు ఇచ్చిన సివిక్స్ అధ్యాపకుడు బావిశెట్టి లక్ష్మీనారాయణలను హెచ్ఎం ఎల్.కృష్ణ, స్థానిక నాయకులు, గ్రామస్తులు అభినందించారు.


మాతృదేవోభవ లఘు నాటకాన్ని ప్రదర్శిస్తున్న తామరాడ విద్యార్థులు

ప్రత్తిపాడు విద్యార్థికి రెండో స్థానం

ప్రత్తిపాడు: కాకినాడ జేఎన్‌టీయూకేలో ఆదివారం నిర్వహించిన క్రియ పిల్లల పండుగలో ప్రత్తిపాడు విద్యార్థికి రెండో స్థానం లభించింది. స్థానిక కంప్యూటర్స్ మెకానిక్ బిళ్లకుర్తి వెంకటేష్ కుమారుడు దర్శిక్ శివ కార్తిక్ సబ్ జూనియర్స్ విభాగంలో విచిత్ర వేషధారణలో (స్వామి వివేకానంద) ద్వితీయ బహుమతిని పొందాడు. ఈ మేరకు నిర్వాహకుల నుంచి అవార్డును అందుకున్నాడు.


వేషధారణ పోటీల్లో అవార్డు అందుకుంటున్న దర్శిక్‌శివ కార్తిక్

విలువలతో కూడినదే పాత్రికేయ రంగం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు: ప్రజాస్వామ్యంలో నాలుగో ఎస్టేట్‌గా భావించే పాత్రికేయ రంగం విలువలతో కూడినదని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. పత్రికారంగం కత్తి మీద సాము వంటిదన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే ఏకైక రంగమన్నారు. ఒక ప్రక్క ప్రభుత్వాలు చేసే మేలును ప్రశంసిస్తూనే మరో పక్క ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టే ధైర్యమున్న రంగమని కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. సమావేశంలో ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని, స్థానిక నాయకులు అమరాది వెంకట్రావు, యాళ్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నానాజీ



ప్రత్తిపాడు రూరల్: గోపాలమిత్ర యూనియన్ జిల్లా కార్యవర్గ అధ్యక్షుడిగా మండలంలోని ఉత్తరకంచి గ్రామానికి చెందిన గోపాల మిత్ర బెంగా నానాజీ ఎన్నికయ్యారు. కాకినాడలో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గ ఉపాధ్యక్షుడిగా కె.సత్యనారాయణ, కార్యదర్శిగా ఎస్.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా వై.సత్యనారాయణ, ట్రెజరర్‌గా కేసీహెచ్ అప్పన్న ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

టీం రక్ష ఏర్పాటు

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో టీం రక్ష ఏర్పాటు చేశారు. టీం రక్షా పోస్టర్‌ను ఆదివారం హోం మంత్రి అనిత, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆవిష్కరించారు. తుని, పాయకరావుపేట పరిసర ప్రాంతాల్లో హైస్కూళ్లు, కాలేజీలను టీంగా ఏర్పాటు చేసి విద్యార్థులకు అనేక విషయాలపై చైతన్యం కల్పిస్తామని రోటరీ క్లబ్ ప్రతినిధులు మంత్రి, జిల్లా కలెక్టర్‌లకు వివరించారు. యువతను డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్‌యాప్స్, చెడు వ్యసనాల జోలికి వెళ్లకుండా అప్రమత్తం చేయడం, ఆడ పిల్లలపై లైంగిక దాడులు జరగకుండా నియంత్రించడం, ఫోన్‌కు బానిస కావడం ద్వారా వచ్చే ఇబ్బందులు తెలియజేయడం, స్కూల్, కాలేజీల వద్ద ఆకతాయిల బెడద లేకుండా చూడడం, ర్యాష్ డ్రైవింగ్ వలన కలిగే అనర్థాలను వివరించడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. టీం రక్ష ఏర్పాటుకు కృషి చేసిన క్లబ్ ప్రతినిధులను మంత్రి అనిత అభినందించారు. కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్, రోటరీ అధ్యక్షుడు మంగరాజు, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీం రక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హోం మంత్రి అనిత, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


ధర్మవరంలో గౌరీశంకరుల ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే గౌరీశంకరుల ఉత్సవాల పోస్టర్‌ను ఆదివారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నేత, ఎంఎంఆర్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆవిష్కరించారు. గ్రామంలో ఐక్యతను పెంచేందుకు 87 సంవత్సరాలుగా గౌరీశంకరుల ఉత్సవాలు సజావుగా నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు రూ.25 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కిల్లాడి బాబ్జి, కోనేటి రాజబాబు, గొర్ల వీరసాంబ మూర్తి, గొనగాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

రౌతులపూడి: గ్రామ శివారులో ఏలేరు కాలువను అనుకుని రహస్యంగా నిర్వహిస్తున్న సారాబట్టీలపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి సారా తయారు చేస్తున్న రౌతులపూడి గ్రామానికి చెందిన బత్తిన ఆనంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 50 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్క్యులర్ అమలు చేయాలి

గోకవరం: ఆర్టీసీలో 1/19 సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్, అధ్యక్షుడు పి.ప్రసాద్, సెక్రటరీ అక్కిరెడ్డి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆర్టీసీ డిపో గేటు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ఉద్యోగులు చిన్నచిన్న తప్పులకు ఉద్యోగాలు కోల్పోతుండటంతో ప్రభుత్వం, ఆర్టీసీ మేనేజ్‌మెంట్‌తో సంప్రదింపులు జరిపి సర్క్యులర్ 1/2019ను సాధించుకున్నామన్నారు. కానీ కొంతమంది అధికారులు కావాలని ఈ సర్క్యులర్‌ని పక్కన పెట్టి సిబ్బంది చేస్తున్న చిన్న తప్పులకు సస్పెండ్ చేసి ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారన్నారు. ఇటీవల డిపోలో కొంత మంది సిబ్బంది ఈవిధంగా సస్పెన్షన్‌కు గురయ్యారన్నారు. ఈ సర్క్యులర్ ఖచ్చితంగా అమలు చేయాలని వారు కోరారు.

వాకర్స్‌క్లబ్ ఉత్తమ గవర్నర్‌గా శివాజీ



అవార్డు అందుకుంటున్న తుని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: వాకర్స్ ఇంటర్నేషనల్ ఉత్తమ గవర్నర్‌గా స్థానిక వాకర్స్‌క్లబ్ ప్రతినిధి చదరం శివాజీ ఎంపికయ్యారు. ఏలూరులో ఆదివారం జరిగిన 33వ వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో ఉత్తమ గవర్నర్‌గా చదరం శివాజీ, వాకర్స్ బెస్ట్ లీడర్ అవార్డుకు కుందెం సత్యనారాయణ ఎంపికయ్యారు. వీరికి వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వి.మురళీమోహన్‌రావు బహుమతులు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలను తుని వాకర్స్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు, అధ్యక్షుడు డీఎస్ మూర్తి, ప్రతినిధులు చోడిశెట్టి త్రిమూర్తులస్వామి తదితరులు అభినందించారు.

ఆధ్యాత్మికం.. సర్వజన హితం

- భక్తి, సేవా మార్గమే లక్ష్యంగా పని చేస్తున్న శ్రీరమణ సేవాశ్రమం
- మానవ సంబంధాల బలోపేతానికి కృషి
- నేడు రమణ మహర్షి జయంతి

ప్రత్తిపాడు రూరల్: తమిళనాడులోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరుణాచలం. అక్కడ వేంచేసిన అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామిని నిత్యం వేలాది మంది దర్శిస్తారు. అక్కడి భగవాన్ రమణ మహర్షి ఆశ్రమాన్ని దర్శించుకుని ఆయన చూపిన బాటలో పయనిస్తూ మోక్ష సాధనకు కృషి చేస్తున్నవారు ఎందరో ఉన్నారు. జీవితంలో ఒక్కసారైనా తిరువణ్ణామలై వెళ్లి, గిరి ప్రదక్షిణ చేయాలని తపిస్తున్నవారెందరో. అటువంటి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాన్ని తలపించేలా ఆంధ్రా అరుణాచలంగా భాసిల్లుతోంది ప్రత్తిపాడు మండలం రాచపల్లిలోని శ్రీరమణ సేవాశ్రమం. ఇది ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతూ.. మూడు దశాబ్దాలుగా అనేక మందిని ఆధ్యాత్మిక పథంలో నడిపిస్తోంది. రమణ మహర్షి మార్గంలో పయనిస్తూ సంఘహిత కార్యక్రమాలు చేపడుతోంది. సత్సంగం, సేవ అనే రెండు సాధనాలతో మానవ సంబంధాలను బలోపేతం చేసేందుకు నిరంతరం త్రికరణ శుద్ధిగా కృషి చేస్తోంది.

124 ఏళ్ల క్రితం ఆశ్రమం ఏర్పాటు

రాచపల్లికి చెందిన కవల బ్రహ్మచారులు రమణానంద, లక్ష్మణానంద ఆధ్యాత్మిక సాధనలో రమణ మహర్షి బోధనలకు ఆకర్షితులయ్యారు. వీటి ద్వారా సమాజావృద్ధికి దోహదపడాలనే కాంక్షతో 1900 ఆగస్టు 15న జాతీయ రహదారిని ఆనుకొని రాచపల్లి సమీపాన ప్రజల విరాళాలతో నాలుగెకరాల స్థలాన్ని సమకూర్చి ఆశ్రమం ఏర్పాటు చేశారు. రమణ మహర్షి ప్రధాన ఆలయం, ధ్యాన మందిరాన్ని నిర్మించారు. ఈ ఆశ్రమాన్ని ఆనుకొని అపీతకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయాన్ని, దక్షిణా మూర్తి, గణపతి, కుమారస్వామి ఉపాలయాలను నిర్మించారు. క్రమంగా ఈ ఆధ్యాత్మిక కేంద్రాన్ని ఆంధ్రా అరుణాచలంగా తీర్చిదిద్దారు.


రాచపల్లి సమీపంలోని శ్రీరమణా సేవాశ్రమం

నేటి జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

శ్రీరమణ మహర్షి 145వ జయంతి సందర్భంగా సోమవారం ఆశ్రమానికి 15 వేల మందికి పైగా భక్తులు వస్తారని అంచనా. సత్యసాయి సేవాసంస్థలతో సహా పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రమణ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆశ్రమంలో భారీ ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, అఖండజ్యోతి ప్రజ్వలన, సమష్టి ధ్యానం, ఉపనిష్యత్ పారాయణ, గోపూజ, రమణ అష్టోత్తర శతనామావళి అర్చన, లక్ష్మీ గణపతి హోమం, ఆధ్యాత్మిక సభ నిర్వహించనున్నారు.

ఆధ్యాత్మికత, సేవా భావాన్ని పెంపొందించమే లక్ష్యం

సీతానగరం మండలం వంగలపూడిలోని శ్రీసద్గురు సేవాశ్రమంలో సాధనకు వెళ్లినప్పుడు రమణ మహర్షి తత్వానికి ప్రేరణ పొందాను. దాతల సహకారంతో రాచపల్లి అడ్డురోడ్డు వద్ద నాలుగు ఎకరాల స్థలంలో రమణ సేవాశ్రమాన్ని నెలకొల్పాం. సేవ, సత్సంగం సాధనాలుగా సమాజ వికాసానికి ప్రేరణ కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. మానవ బంధాలు బలపడేలా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– స్వామి రామానంద, శ్రీరమణ సేవాశ్రమం పీఠాధిపతి, రాచపల్లి, ప్రత్తిపాడు మండలం

నూతన కార్యవర్గం ఎన్నిక


రౌతులపూడిలో శ్రీనివాస్‌ను అభినందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్ తదితరులు

రౌతులపూడి: బీజేపీ మండల అధ్యక్షుడిగా ములగపూడి గ్రామానికి చెందిన లవుడు శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సినిమా సెంటర్‌లో పార్టీ కార్యకర్తలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను, ప్రధాన కార్యదర్శిగా యెనుముల రాజా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరుతో బాటు మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కన్వీనర్ సింగిలిదేవి సత్తిరాజు, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు చిట్రి పాపారావు వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

వరికుప్ప దగ్ధం



కోటనందూరు: మండలంలోని జగన్నాథపురంలో రైతు బంగారు కొండబాబుకు చెందిన వరికుప్ప దగ్ధమైంది. రెండెకరాల విస్తీర్ణంలో పంటను రైతు కొండబాబు గ్రామశివారులో కుప్పగా వేశారు. కాగా ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు ఈ వరికుప్పకు నిప్పు పెట్టారు. భారీగా మంటలు వ్యాపించి కుప్ప మొత్తం కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో రూ.లక్షన్నర నష్టం వాటిల్లినట్లు బాధితుడు కొండబాబు తెలిపారు. అధికారులు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.